సాక్షి
నిర్మల్
శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



పునరావాసానికి అడుగులు

కవ్వాల్ అభయారణ్యంలోని గ్రామాల తరలింపునకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. అడవిలోని మూడు గ్రామాల్లో మరోసారి సర్వే నిర్వహించారు. 8లో▸



చెరువును పట్టించుకునేవారేరి?

కుంటాల మండలంలోని పాతవెంకూర్ సమీపంలో ఓలా వాగుపై నిర్మించిన చెరువు అలుగుకు ఏడాదికే బుంగ పడటంతో నీరు నిల్వ కుండా బయటకు వెళ్తోంది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.9 /25.8

ఆకాశం మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయి. సాయంత్రం అక్కడక్కడా చినుకులు పడొచ్చు.



న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ఫిల్టర్‌బెడ్ పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నూతన సమీకృత కలెక్టరేట్‌ను సందర్శించి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని, ఐమాస్‌లైట్లు, టవర్స్, డివైడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎల్లపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ధర్మసాగర్ చెరువు ప్రాంతాన్ని పరిశీలించి పార్క్ ఏర్పాటు, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, సుందరీకరణ పనులు చేపట్టాలని, చెరువు చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సిద్దాపూర్‌లో నర్సరీ, ఫిల్టర్ బెడ్‌ను సందర్శించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సుభాష్, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు నిరంతరం శ్రమించాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఏఎస్పీ

భైంసాటౌన్(ముధోల్): గెలుపు కోసం విద్యార్థులు నిరంతరం శ్రమించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు కళాశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధా క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏఎస్పీకి జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, కళాశాల సీపీడీసీ సభ్యులు నాగేశ్, మల్లికార్జున్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24న తల్లిదండ్రులతో సమావేశం

నిర్మల్‌రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 24న తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో ప్రతీ నెల మూడో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తామని, ఈసారి మాత్రం విద్యా సంవత్సరం చివరి రోజైన సోమవారం నిర్వహించాలని సూచించారు. పండుగ వాతావరణంలో సమావేశం నిర్వహించాలని, విద్యాశాఖ సూచించిన ఫ్లెక్సీని పాఠశాలల్లో ప్రదర్శిస్తూ విద్యార్థులు నేర్చుకున్న అభ్యసన అంశాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించాలన్నారు. విద్యార్థుల వార్షిక పరీక్షల ప్రగతిని సమీక్షిస్తూ పాఠశాల అభివృద్ధి కోసం తల్లిదండ్రుల సూచనలు ఆహ్వానించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌రూరల్: వేసవి సెలవుల్లో 42 రోజుల పాటు ప్రభుత్వం అందించనున్న టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ) శిక్షణకోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, హనుమకొండ కేంద్రాల్లో మే 1 నుంచి జూన్ 11 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 23 నాటికి 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉండి, పదో తరగతి పాస్ అయిన వారు లేదా ఎస్‌బీటీఈటీ ద్వారా (టీసీసీ) టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 21 నుంచి 30 లోగా ఆయా శిక్షణ కేంద్రాల్లోని డీఈవో కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

సెలవులు గడిపేదెలా..!



ఈ చిత్రంలో కనిపిస్తోంది జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో గల పార్కు. దీని కోసం అక్షరాల రూ.65 లక్షల నిధులు ఖర్చు చేశారు. కానీ ఏం లాభం.. ఒక్క వర్షంతో మొత్తం మునిగిపోయింది. లక్షలు పెట్టి చేసిన పనులు నామరూపాల్లేకుండా పోయాయి. మళ్లీ ఈ పార్కును పట్టించుకునే నాథుడే లేడు. దీంతో స్థానికులకు ఆహ్లాదం మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది.



ఈ ఫొటోలో కనిపిస్తోంది భైంసా పట్టణంలోని తెలంగాణ క్రీడాప్రాంగణం. ఇక్కడ బోర్డు మీద పేరుకే క్రీడాప్రాంగణం అని ఉంది. కానీ అందులో కనీసం ఆడుకునే వసతులు, వస్తువులు ఏమాత్రం కనిపించవు. ఇక్కడి పార్కు పరిస్థితి కూడా అంతే. ఏమాత్రం నిర్వహణ లేక ఆహ్లాదం అనే మాటకే అందనంత దూరంలో ఉంది.



జిల్లా కేంద్రంలో పాడుబడిన ఇంద్రానగర్ పార్కులో ఓ మూలన ఆడుతున్న పిల్లలు



జిల్లా కేంద్రంలో ఎవరికీ పట్టని ఖిల్లాగుట్ట

- ఆడేందుకు క్రీడాప్రాంగణాలేవి?
- ఆహ్లాదానికి పార్కులెక్కడ..?
- పర్యాటక ప్రాంతాలపై పట్టింపేది?
- జిల్లాలో తీరుపై సర్వత్రా అసంతృప్తి

నిర్మల్: 'నాన్నా.. మాకు సెలవులొచ్చాయి కదా.. మరి ఇప్పుడైనా నన్ను, తమ్ముడిని ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు కదా..' అని చిన్నారి బతిమాలుతుంటే.. 'ఎక్కడికి తీసుకెళ్లాలి బేటా.. మనదగ్గర ఏమున్నాయని..? లోకల్‌లో ఒక్క పార్క్ కూడా లేదు. పోనీ ఆడుకోవడానికి తీసుకెళ్దామంటే.. ఒక్క గ్రౌండ్ కూడా సరిగా లేదు. ఇక ఏవైనా కోటలు, చారిత్రక ప్రదేశాలు చూపిద్దామంటే వాటి దగ్గరి దాకా వెళ్లేందుకే దారి లేదు. కొన్నిరోజులు ఆగండి బేటా.. నెల జీతం రాగానే ఎక్కడికైనా టూర్ వెళ్దాం..' అంటూ ఆ తండ్రి చిన్నారిని సముదాయించాడు. ప్రస్తుతం చాలా కుటుంబాల్లో ఇదే పరిస్థితి. రోజూ పుస్తకాలతో కుస్తీ పట్టే పిల్లలు వేసవి సెలవులు రాగానే కొంత రిలాక్స్ అవుతారు. ఆటపాటలతో పాటు ఆహ్లాదాన్ని కోరుకుంటారు. పిల్లలకు సెలవులే కాబట్టి పెద్దలూ వారితో కలిసి కాసింత హాయిగా గడపాలనుకుంటారు. కానీ జిల్లాలో అందుకు అవకాశమేది..? కనీసం సాయంత్రం పూట ఓ గంట ఇంటిల్లిపాది ప్రశాంతంగా పచ్చని వాతావరణంలో గడిపేందుకూ అవకాశం లేకపోవడం శోచనీయం

ఉన్నదొక్కటే.. అదీ అంతంతే..

జిల్లా మొత్తంలో చెప్పుకోవడానికి సరైన పార్క్ అంటే జిల్లా కేంద్రం శివారులోని గండిరామన్న హరిత వనం మాత్రమే. అటవీ ప్రాంతంలోనే పచ్చని చెట్ల మధ్యలో ఏర్పాటు చేశారు. కానీ ఇది కూడా అంతంత మాత్రంగానే అభివృద్ధికి నోచుకుంటోంది. ఆదిలాబాద్, ఇతర ప్రాంతాల అర్బన్ పార్కులతో పోలిస్తే ఇక్కడి వసతులు, ఆటవస్తువులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక్కడికి వస్తున్న వారి సంఖ్యకు తగ్గట్లు సరైన ఏర్పాట్లూ లేవు. ఇందులో గతంలో తీసుకువచ్చిన మూషిక జింకలూ జాడలేకుండా పోయాయి. పట్టణాలతో పోలిస్తే కొన్ని పల్లెల్లో అక్కడక్కడ ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలే కొంత నయం అనిపించేలా ఉన్నాయి.

జాడ లేని క్రీడాప్రాంగణాలు

తెలంగాణ క్రీడాప్రాంగణాల పేరిట ఊరూరా బోర్డులు పెట్టి ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేశారు. చాలాచోట్ల పెట్టిన బోర్డులు కూడా జాడలేకుండా పోయాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సాక్షాత్తూ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మైదానంలోనే ఓ మూలన బోర్డును పెట్టి, ఒకట్రెండు ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. అంతే మళ్లీ వాటిని పట్టించుకున్న నాథుడు లేడు. రూ.లక్షలు పెట్టి ఏర్పాటు చేసినవి ఉన్నాయా? లేవా.. అన్న సోయి కూడా లేదన్న విమర్శలున్నాయి. చాలా ఊళ్లల్లో వీటి ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి.

పర్యాటకమున్నా.. పట్టేదెవరికి?

ఆడేందుకు గ్రౌండ్, ఆహ్లాదానికి పార్కులు లేకున్నా జిల్లాలో ఎటు చూస్తే అటు చారిత్రక, పర్యాటక ప్రాంతాలు కోకొల్లలు. పిల్లలకు మనదైన చరిత్రను, జిల్లా గత వైభవాన్ని కళ్లకు కట్టించేలా చూపించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. కానీ ఆ దిశగా అభివృద్ధి చేసి చూపించే నాథుడే లేడు. పాలకులు, అధికారుల మాటల్లో తప్పా చేతల్లో ఎక్కడా పర్యాటకాభివృద్ధి జరగడం లేదు. బాసర నుంచి కడెం దాకా ఎన్నో ప్రదేశాలు, కట్టడాలు ఇప్పటికీ ఉన్నాయి. వాటి వద్దకు వెళ్లేందుకు ఓ దారి, అక్కడ కనీసం ప్రశాంతంగా గడపడానికి పారిశుధ్య వాతావరణం, ఆ ప్రదేశం చరిత్ర చెప్పే ఓ చిన్న బోర్డు పెట్టినా చాలు.. పిల్లలకు జిల్లా చరిత్ర తెలుస్తుంది. ఈ మాత్రం కూడా అభివృద్ధి లేకపోవడంతో చాలా కుటుంబాలు జిల్లా దాటి ఎక్కడెక్కడికో టూర్లకు వెళ్తున్నాయి.

పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామాల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీలతతో కలిసి జిల్లాలోని వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎన్ ఆర్జీఏ పథకం కింద కూలీల సమీకరణ, వంద రోజుల పనిదినాలు, సీసీరోడ్లు, చేపల చెరువులు, పశువులు, మేకల షెడ్లు, చెక్‌డ్యాంలు, ఉద్యానవన పంటల పెంపకం, అంగన్‌వాడీ కేంద్రాలు, అమృత్ సరోవర్ పనులు, పల్లె ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, తదితర వాటిపై చర్చించారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దిలావర్‌పూర్(నిర్మల్): మండలంలోని గుండంపల్లి రైతు వేదికలో గురువారం ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, తదితర అంశాలపై శాస్త్రవేత్త బీ.ఎస్.రావు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ జేడీ అనంతరావు, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి శ్యామ్‌రావు రాథోడ్, ఆయిల్ పామ్ కంపెనీ డీజీఎం రాంమోహన్, ఏవో ప్రవంతి, ఏఈవోలు శ్రీవాణి, భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి అమరులకు నివాళి

- స్తూపం వద్ద ప్రత్యేక పూజలు
- స్వేచ్ఛగా నివాళులర్పించిన ఆదివాసీలు
- అమరులను స్మరించుకున్న నేతలు
- పరిసర ప్రాంతంలో భారీ బందోబస్తు



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరులకు ఆదివాసీలు స్వేచ్ఛగా నివాళులర్పించారు. గురువారం స్తూపం వద్ద సంస్మరణాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారికంగా అనుమతి లేకపోవడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు, అమరుల కుటుంబీకులు, వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు అమరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. 1981లో తమ హక్కుల కోసం పోరాడి పోలీసుల కాల్పుల్లో అమరులైనవారికి సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. ముందుగా ఆనాడు సభకు సారథ్యం వహించిన తుమ్మగూడకు చెందిన తోడసం కట్టి స్మారక జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలకేంద్రంలోని గోండ్‌గూడ నుంచి సంప్రదాయ వాయిద్యాల మధ్య స్తూపం వద్దకు చేరుకున్నారు. అమరుల పేరిట దేవరి చహకటి నాగోరావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. స్తూపం వద్ద నివాళులర్పించారు.

నివాళులర్పించింది వీరే..

ఇంద్రవెల్లిలోని అమరుల స్తూపం వద్ద వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నివాళులర్పించారు. వారిలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కాంగ్రెస్ నాయకులు వెడ్మ బొజ్జు, జాదవ్ నరేశ్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచ్చయ్య, జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, అమరవీరుల ఆశయ సాధన కమిటీ వ్యవస్థాపకుడు ఆత్రం భుజంగ్‌రావు, అధ్యక్షుడు తోడసం నాగోరావ్, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఆదివాసీ నాయకులు కనక తుకారాం, సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, సోయం రాందాస్, పెందోర్ పుష్పరాణి, మెస్రం నాగ్‌నాథ్, జుగ్నాక్ భరత్, గేడం భరత్, కుల పెద్దలు, అమరుల కుటుంబ సభ్యులున్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోలే..

– ఎంపీ సోయం బాపూరావు

భూమి కోసం.. భుక్తి కోసం పోరాడి అమరులైన వారి కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎంపీ సోయం బాపూరావ్ ఆరోపించారు. ఆదివాసీలు 42 ఏళ్లుగా భూమి కోసం పోరాడుతూనే ఉన్నా.. నేటికీ పోడు సమస్య పరిష్కారం కాకపోవడం శోచనీయమన్నారు. గతంలో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో పోడు భూములకు హక్కు పత్రాలు ఇప్పిస్తానని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఆదివాసీలపై ప్రేమ ఉంటే సీఎం కేసీఆర్ వెంటనే ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



నినదిస్తున్న ఎంపీ సోయం, ఆదివాసీలు

హక్కు పత్రాలు ఇవ్వకుంటే మరో ఇంద్రవెల్లి పోరాటానికి ఆదివాసీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడానికి, మత మార్పిడికి అడ్డుకట్ట వేయడానికి మే 29న జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

300 మంది పోలీసులతో బందోబస్తు



ఇంద్రవెల్లిలో పోలీసుల బందోబస్తు

అమరుల సంస్మరణం సందర్భంగా ఇంద్రవెల్లి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ సీహెచ్ నాగేందర్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్తూపం వద్ద బందోబస్తును డీఎస్పీ నాగేందర్ పరిశీలించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- కలెక్టరేట్ ఎదుట వడ్డెర కులస్తుల నిరసన



ర్యాలీగా వస్తున్న వడ్డెర కులస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎల్లపెల్లి ఘటనలో పోలీసులు వడ్డెర కులస్తులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ గురువారం వడ్డెర కులస్తులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎల్లపెల్లిలో ఒకరిని కొట్టి చంపిన ఘటనలో పోలీసులు వడ్డెర కుల సంఘం అధ్యక్షుడు కొండాపురం ప్రభాకర్‌తో పాటు మరో 17 మందిపై కేసు నమోదు చేసి ఆరుగురిని జైలుకు తరలించారన్నారు. ఎవరో చేసిన తప్పులకు వడ్డెర కులస్తులను బాధ్యులను చేయడం అన్యాయమన్నారు. నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని మధ్యవర్తిగా వ్యవహరించిన కులసంఘం సభ్యులపై అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపించారన్నారు.

అకాల వర్షం..



నేలవాలిన నువ్వు పంట

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి లక్ష్మణచాంద, పొట్టపెల్లి, రాచాపూర్, తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన నువ్వుపంట నేలకొరిగింది. పంట చేతికి వస్తున్న సమయంలో అకాల వర్షం కురియడంతో పంట నేల కొరిగిందని, దీంతో దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతిభకు పదును పెట్టేలా..



మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు(ఫైల్)

- విద్యార్థుల కోసం 'సమ్మర్ క్యాంప్స్'
- 'టీచ్ నిర్మల్' పేరిట వేసవి శిబిరాలు
- జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి

నిర్మల్‌ఖిల్లా: వేసవి సెలవుల్లో జిల్లాలోని విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్స్ నిర్వహించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వివిధ స్థాయి విద్యార్థులకు ఈ శిబిరాల్లో యోగా, మెడిటేషన్, వాలీబాల్, కబడ్డీ, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, టెన్నిస్, క్రికెట్, చిత్రలేఖనం, సంగీతం, తదితర వాటిలో శిక్షణ అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మొదటిసారిగా మే 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ, యువజన క్రీడల శాఖ, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 19 మండలాలు, 3 మున్సిపాలిటీలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా మొత్తం 121 కేంద్రాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నైపుణ్యాలు వెలికితీసేలా...

విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యం, అభిరుచులను గుర్తించి ప్రోత్సాహం అందించే విధంగా 'టీచ్ నిర్మల్' పేరిట ఈ వేసవికాలంలో నెలరోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఇందుకు జిల్లాలో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పీఈటీలు, పీడీల సేవలను వినియోగించుకోనున్నా రు. ప్రత్యేకంగా వలంటీర్లను కూడా నియమించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 121 క్యాంపులను ఏర్పాటు చేసేందుకు ఆయా పరిధిలోని పాఠశాలలను కేంద్రాలుగా ఎంపిక చేశారు. విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా ఇండోర్ గేమ్స్ అయిన చెస్, క్యారమ్స్ వంటి వాటితో పాటు, అవుట్ డోర్ గేమ్స్ అయిన క్రికెట్, వాలీబాల్, షటిల్, టెన్నికా యిట్, కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లలో శిక్షణ ఇవ్వనున్నారు.

షెడ్యూల్ ఇలా...

6 నుంచి 10 తరగతులు, లేదా 10 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు మే 1 నుంచి 31వరకు ప్రతీరోజు ఉదయం 7 నుంచి 9 వరకు ఆటలు, 9.15 నుంచి 10.30 వరకు గణితం, సామాన్యశాస్త్రం, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి వాటిలో కనీస సామర్థ్యం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించారు. యోగా, మార్షల్ ఆర్ట్స్ వంటివాటిని కొన్నికేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను పాఠశాల విద్యా , యువజన క్రీడలు, గ్రామీణాభివృద్ధి, పురపాలికలు, పంచాయతీ, ఎంపీడీవో, ఎంపీవోలు, ఎంఈవోలు, నోడల్ అధికా రులు, కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్ఎఫ్, జీపీ కార్యదర్శులకు అప్పగించారు. శిక్షణ అనంతరం జూన్ 3 , 4 తేదీల్లో మండల స్థాయిలో, 6 , 7 తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వేసవి సెలవుల్లో నెల రోజులపాటు కొనసాగే ఈ శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి వారి అభిరుచులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం తోడ్పడుతుంది. విద్యార్థుల ఎదుగుదల శరీర ధారుడ్యానికి కూడా దోహదపడుతుంది. మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశాలమేరకు జిల్లాలోని దాదాపు 6 వేలకు పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

అటవీ అనుమతులకు తాత్కాలిక బ్రేక్

నిర్మల్: జిల్లాలోని సారంగాపూర్ మండలం చించోలి(బి) సమీపంలోని అటవీ భూమిలో అటవీయేతర పనులు చేపట్టడంపై కేంద్ర అటవీశాఖ తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ఇక్కడ వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం కోసం 3.648 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించారు. ఇందులో నిబంధనలు పాటించడం లేదని, ఓ ఈద్‌గాను నిర్మిస్తున్నారని వెంకటేశ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేంద్ర అటవీ, పర్యావరణశాఖ ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీస్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ డి.మంజునాథ స్పందించారు. ఈమేర కు భూకేటాయింపుపై వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర అటవీశాఖ నివేదిక ఇవ్వాలంటూ లేఖలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ నాయకులకు నోటీసులు

సోన్: భూములు ఆక్రమించారని మంత్రి ఐకే రెడ్డిపై ఆరోపణలు చేసిన బీజేపీ నాయకులకు నోటీసులు జారీ చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. గత నెల మార్చి రెండో తేదీన బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, రాచకొండ సాగర్, ప్రేమ్‌కుమార్, సుంకరి ముత్యం, జక్క నర్సయ్య, మేక మల్లేశ్‌యాదవ్, వినోద్ సోన్ మండలంలోని పాక్‌పట్ల శివారులోని అల్లోల గౌతమ్‌రెడ్డి, వారి కుటుంబసభ్యుల భూముల్లోకి అనుమతి లేకుండా వెళ్లారు. మంత్రి భూములు అక్రమంగా ఆక్రమించారని ఆరోపణలు చేశారు. దీంతో అల్లోల గౌతమ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బీజేపీ నాయకులపై మార్చి మూడో తేదీన కేసు నమోదు చేశారు. దీంతో కోర్టుకు హాజరు కావాలని వచ్చిన నోటీసులను గురువారం నాయకులకు అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్‌బీఐలో షార్ట్ సర్క్యూట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మెయిన్ బ్రాంచ్‌లో గురువారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఏసీ నుంచి పొగలు రాగా అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏసీ నుంచి మంటలు చెలరేగి దట్టమైన పొగలు రాగా సీఓటూ ద్వారా మంటలు ఆర్పివేశారు. ఏసీ, విద్యుత్ వైర్లు దగ్ధం కాగా పెనుప్రమాదం తప్పింది. దాదాపు రూ.2లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ శివాజీ, సిబ్బంది మంటలు ఆర్పివేశారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు



రిమ్స్‌కు తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామంలో వీధి కుక్కల దాడిలో చిన్నారులు గాయపడ్డారు. అంకోలి గ్రామంలో గురువారం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారులు మెస్రం తన్వేశ్రీ, బర్కుంట సూర్య తేజపై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. మెస్రం తన్వేశ్రీపై దాడి చేసిన కుక్కలు ఆమె పిక్కను పట్టుకొని కొద్ది దూరం లాక్కెళ్లాయి. దీంతో పిక్క భాగంలో మాంసం ఊడి తీవ్ర గాయమైంది. సూర్య తేజ చేయిని కరవడంతో గాయపడ్డాడు. స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

సిరికొండ: మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన గిరిజన రైతు పుర్క జంగుబాపుకు చెందిన ఎద్దు బుధవారం రాత్రి పిడుగుపాటుతో మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. తనను ఆదుకోవాలని కోరాడు

మామిడి చెట్లు దగ్ధం

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్‌లో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో అల్లెపు పీటర్‌కు చెందిన మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. కొందరు కావాలనే తమ మామిడి తోటకు నిప్పంటించారని బాధితుడు ఆరోపించాడు. గతంలోనూ నిప్పు పెడితే ఖానాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ట్లు వాపోయారు. అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 9014114663, 9959617233 [M-1190673]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793416]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

పునరావాసానికి అడుగులు

- టైగర్‌జోన్‌లోని మూడు గ్రామాల తరలింపునకు ప్రతిపాదనలు
- సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి పంపిన అధికారులు
- అనుకున్న ప్రదేశం కేటాయిస్తేనే వెళ్తామంటున్న గిరిజనులు



అలీనగర్ గ్రామం

జన్నారం: పులి సంరక్షణ కోసం కవ్వాల్ అభయారణ్యంలోని గ్రామాల తరలింపునకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. పునరావాసానికి అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో అడవిలోని మూడు గ్రామాల్లో మరోమారు సర్వే నిర్వహించారు. నివేదికలను ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాగానే, పునరావాస ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

అలజడి తగ్గించే దిశగా..

అడవిలో వన్యప్రాణులకు, పులికి అలజడి లేకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అడవుల్లోకి మనుషులు, పశువులు వెళ్లకుండా నివారించారు. కోర్ ఏరియా పరిధిలో ఆంక్షలు విధించారు. అలజడి తగ్గించే ఏర్పాట్లు చేశారు. అయినా అడవి లోపలి గ్రామాల ప్రజలు పశువులను అడవిలోకి తోలుకెళ్తున్నారు. తరతరాలుగా అడవిలోనే ఉంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులు అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో అడవిలో అలజడి తగ్గడం లేదు. అలజడి తగ్గిస్తే తప్ప పులులు ఇక్కడ ఆవాసం చేసుకునే అవకాశం లేదని అధికారులు గుర్తించారు.

గ్రామాల తరలింపు షురూ..

అడవిలో ఉంటూ జీవనం సాగిస్తున్న గిరిజన గ్రామాలను తరలించి.. వారికి పునరావాసం కల్పించి, అలజడి తగ్గించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో టైగర్‌జోన్ పరిధిలోని రాంపూర్, మైసంపేట, అలీనగర్, దొంగపల్లి, మల్యాల గిరిజన గ్రామాలను ముందుగా తరలించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో మొదటి దశలో నిర్మల్ జిల్లా కడెం మండలం రాంపూర్, మైసంపేట గ్రామాల ప్రజలకు పునరావాసం కలిగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేశాయి. ఈ క్రమంలో మొదటి దశలో ఈ గ్రామాల ప్రజలకు కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో భూమి కేటాయించి కాలనీ నిర్మిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి సౌకర్యాలు కల్పిస్తే గ్రామాలు ఖాళీ చేస్తామని గిరిజనులు తెలిపారు.

మరో మూడు గ్రామాలకు ప్రతిపాదనలు..

కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలోని జన్నారం అటవీ డివిజన్‌లో మరో మూడు అటవీ గ్రామాలను తరలించడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మల్యాల, దొంగపల్లి, అలీనగర్ గ్రామాల్లో రెవెన్యూ, అటవీ అధికారులు జాయింట్‌గా సర్వే నిర్వహించారు. కుటుంబాల వివరాలు నమోదు చేశారు. తర్వాత ప్రక్రియ ముందుకు సగలేదు. ఆయా గ్రామాలను వీడేందుకు గిరిజనులు కూడా అంగీకరించలేదు. తాజాగా మల్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని దొంగలపల్లి, అలీనగర్, మల్యాల గ్రామాలను అడవి నుంచి బయటకు తీసుకురావాలని ప్రతిపాదించారు. అలీనగర్‌లో 70 ఇళ్లు, 350 మంది, దొంగపల్లిలో 85 ఇళ్లు, 380 మంది, మల్యాలలో 55 ఇళ్లు, 130 మంది నివాసం ఉంటున్నారు. అయితే కుటుంబాల వివరాలు సేకరించేందుకు నెల క్రితం మరోసారి సర్వే నిర్వహించి 316 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వివరాలను ప్రభుత్వానికి పంపారు. పునరావాసానికి కావాల్సిన నిధుల గురించి వివరించినట్లు అధికారులు తెలిపారు.

కోరుకున్న ప్రదేశం కేటాయిస్తేనే..

పునరావాసం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఐదేళ్ల క్రితం విముఖత చూపిన గిరిజనులు తాజాగా సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న గ్రామాలకు రోడ్డు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేకపోవడం, కనీసం అంబులెన్స్ కూడా వచ్చే వీలు లేకపోవడంతో అడవి నుంచి బయటకు రావడానికి అంగీకరిస్తున్నారు. అయితే తాము కోరుకున్న ప్రాంతం కేటాయించాలని కండీషన్ పెడుతున్నారు. కొత్తూరుపల్లి గ్రామ సమీపంలోని సర్వే 270లో ఇళ్లు నిర్మించి వ్యవసాయ భూమి కేటాయించాలని కోరుతున్నారు. అయితే కొత్తూరుపల్లి కూడా టైగర్ జోన్ కోర్ ఏరియాలో ఉన్నందున పుట్టిగూడ ప్రాంతంలో భూమి కేటాయిస్తామని అటవీ అధికారులు పేర్కొంటున్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు..

ఐదేళ్ల క్రితం పునరావాసం కల్పించే గ్రామాల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ప్రతిపాదించారు. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలి. అయితే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తాజాగా ఆ మొత్తాన్ని రూ.15 లక్షలకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల ప్యాకేజీ లేదా భూమి ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. వీటికి తోడు ఇప్పుడు ఉన్న భూమికి బదులుగా భూమిని ఇస్తూ ఇళ్ల నిర్మాణం, కాలనీ ఏర్పాటు, పూర్తి సౌకర్యాలు కల్పించాలనే నిబంధన ఉంది. అయితే ఇందులో కొందరు ప్యాకేజీ తీసుకోవడానికి, కొందరు భూమి తీసుకోవడానికి సుముఖత చూపుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పునరావాస పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

ఆవాసం ఉండని పులి..

కవ్వాల్ అభయరాణ్యాన్ని 2012, ఏప్రిల్ 10న టైగర్‌జోన్‌గా కేంద్రం ప్రకటించింది. ఈ టైగర్ జోన్‌లో 893 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియాగా, 1,123 చదరపు కిలోమీటర్లలో బఫర్ ఏరియాగా ఏర్పాటు చేశారు. కవ్వాల్ టైగర్ జోన్‌కు సమీపంలోని తడోబా, ఇంద్రావతి టైగర్ జోన్ల నుంచి పులులు వచ్చే అవకాశాలున్నాయి. దీంతో టైగర్‌జోన్ పరిధిలో దట్టమైన అడవులు ఉండి, అలజడి లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే అడవుల్లో పశువుల, మనుషుల సంచారం అధికంగా ఉండటంతో పులులు వచ్చి వెళ్లిపోతున్నాయి. స్థానికంగా ఆవాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. ఇందు అలజడే కారణమని అధికారులు గుర్తించారు.

కొత్తూరుపల్లిలో కేటాయించాలి..



1994లో కొత్తూరుపల్లి ప్రాంతంలో జంగల్ కొట్టుకున్నాం. 270 సర్వే నంబర్‌లో మా మూడు గ్రామాలకు సరిపడా భూమి ఉంది. అక్కడకు తరలిస్తే వెళ్లడానికి సిద్ధం. జంగల్ కొట్టినప్పుడు మాపై కేసులు పెట్టారు. జైళ్లకు పంపారు. ఇంత కష్టపడ్డ ఆ భూమిని అటవీ అధికారులు తీసుకుంటున్నారు. మా మూడు గ్రామాలను అదే ప్రాంతానికి తరలించి సౌకర్యాలు కల్పించాలి.

– హన్మంతరావు, సర్పంచ్ మల్యాల

ప్రతిపాదనలు పంపాం



అటవీ గ్రామాలకు పునరావాసం కల్పించే విషయంపై సర్వే నిర్వహించాం. ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపించాం. బడ్జెట్ కేటాయించాలని కోరాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పునరావాసంపై నిర్ణయం తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడతాం. గిరిజనుల విన్నపాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

26న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాక



మాట్లాడుతున్న రాంచంద్రారెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: టీపీసీసీ తలపెట్టిన నిరుద్యోగ నిరసన దీక్షలో భాగంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈ నెల 26న జిల్లాకు రానున్నారని సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సీ రాంచంద్రారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్రత్ సుజాత తెలిపారు. పట్టణంలోని సీఆర్ఆర్ నివాసంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ పట్టణానికి చేరుకుంటారని వివరించారు. జిల్లా ప్రజలు, నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. కోరి తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయనుకుంటే పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, నిరుద్యోగులు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు రాని వారికి నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోయి, కమీషన్లు వచ్చే కార్యక్రమాలు చేపడుతూ.. అభివృద్ధి పనులు విస్మరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇళ్లు ఇవ్వడం, క్యాలెండర్ ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం, రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, తప్పకుండా ప్రతి పేద వారికి న్యాయం చేయడం, రూ.500 లకే వంటగ్యాస్ సిలిండర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఈ ప్రభుత్వం ఏ ఒక్కరికి సొంతిల్లు ఇవ్వలేదని ఆరోపించారు. నాయకులు నరేశ్‌జాదవ్, అల్లూరి సంజీవరెడ్డి, జెడ్పీటీసీలు గోక గణేశ్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, కళ్యాణం రాజేశ్వర్, బాపన్న, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అంబకంటి అశోక్, వసీమొద్దీన్, కోటేశ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, రూపేశ్‌రెడ్డి, రాజేశ్వర్ తదితరులున్నారు.

పెళ్లి చేసుకోవాలని వేధించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: వివాహితను పెళ్లి చేసుకోమని వేధింపులకు పాల్పడి దాడి చేసిన వ్యక్తిపై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన ఓ మహిళ భర్తతో గొడవపడి ఏడాది క్రితం తన తల్లిగారి ఊరైన ఇంద్రానగర్‌కు వచ్చి నివాసముంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఉపాధి కోసం క్యాటరింగ్ సర్వీస్‌లో పనిచేస్తోంది. అక్కడే పనిచేసే ఖుర్షీద్‌నగర్‌కు చెందిన గైక్వాడ్ మనోజ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. భర్తకు విడాకులిచ్చి తనను పెళ్లిచేసుకోవాలని మనోజ్ వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె అద్దెకుంటున్న ఇంటిని ఖాళీచేసి వెళ్తుండగా బూతులు తిడుతూ ఆమెపై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు టూ టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే కేసులు



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన అధికారులు

నేరడిగొండ: కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే నాన్‌బెయిల్ కేసులు నమోదు చేస్తామని సిరిచెల్మ ఎఫ్ఆర్ఓ వాహబ్ అహ్మద్ హెచ్చరించారు. మండలంలోని కుంటాల(కె) గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ, పి.శ్రీనివాస్, జి.అశోక్ టేకు సైజులను అక్రమంగా నిల్వ ఉంచగా గురువారం వారిని పట్టుకొని నేరడిగొండ తహసీల్దార్ పవన్‌చంద్ర ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. అడవులను సంరక్షించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. బైండోవర్ చేసిన వారిలో కుంటాల సెక్షన్ ఆఫీసర్ వసంత్‌రావు, బీట్ అధికారి సచిన్, సర్పంచ్ అశోక్ ఉన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో స్వీపర్ ఉద్యోగం



పెంబి మండలం తాటిగూడ గ్రామానికి చెందినట్లు సమర్పించిన నకిలీ ఆధార్



కడెం తహసీల్దార్ జారీ చేసిన నకిలీ సర్టిఫికెట్

- మందపల్లి కేజీబీవీలో ఆలస్యంగా వెలుగులోకి..
- కడెం మండల వ్యక్తి.. పెంబి మండలంగా నకిలీ ధ్రువపత్రం సమర్పణ

పెంబి: నకిలీ ఆధార్, కులం, నివాస ధ్రువపత్రాలు సృష్టించుకొని స్వీపర్‌గా ఉద్యోగం పొందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కడెం మండలానికి చెందిన నాగవత్ జ్యోతి.. పెంబి మండలం తాటిగూడ గ్రామానికి చెందిన వ్యక్తిగా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించుకొని ఇదే మండలంలోని మందపల్లి కేజీబీవీలో స్వీపర్ ఉద్యోగం పొందింది. వివరాల్లోకి వెళితే.. మందపల్లి కేజీబీవీ పాఠశాలలో తొమ్మిది నెలల కిందట నాన్ టీచింగ్ ఉద్యోగం కోసం కాంట్రాక్ట్ పద్ధతిన నోటిఫికేషన్ ఇవ్వగా ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఉద్యోగానికి స్థానికులకు మొదట ప్రాధాన్యమిచ్చి మెరిట్ ఆధారంగా ఎంఈవో ఎంపిక చేస్తారు. దీనికి కడెం మండలానికి చెందిన నాగవత్ జ్యోతి.. పెంబి మండల నకిలీ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకొంది. దీంతో మెరిట్ ప్రకారం జ్యోతికి స్వీపర్ ఉద్యోగం ఇవ్వడంతో ఆరు నెలలుగా కేజీబీవీలో పని చేస్తోంది. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన కులం, నివాసం పత్రాలపై కడెం తహసీల్దార్ సంతకం ఉండగా.. పెంబి మండలం, తాటిగూడ గ్రామానికి చెందినట్లు ఆధార్‌లో ఉన్నట్లు గుర్తించారు. జ్యోతిపై మండలానికి చెందిన పలువురు కలెక్టర్, డీఈవో, పెంబి తహసీల్దార్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. నకిలీ సర్టిఫికెట్లను పరిశీలించకుండానే జ్యోతికి స్వీపర్ ఉద్యోగం ఇచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

విధుల నుంచి తొలగించాం..

పెంబి మండలం తాటిగూడ గ్రామంగా నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి కడెం మండలానికి చెందిన నాగవత్ జ్యోతి మందపల్లి కేజీబీవీలో ఉద్యోగం పొందింది. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్లు మా దృష్టికి రావడంతో ఆమెను విధుల నుంచి తొలగించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదన్ తెలిపారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నైపుణ్యం పెంపొందించేందుకే వేసవి శిబిరాలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను మరింత పెంపొందించేందుకే వేసవి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యం నిర్వహిస్తున్న సమ్మర్ స్పార్కిల్స్ 2023 శిబిరాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను నస్పూర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, జిల్లా కోఆర్డినేటర్ బాలభాస్కర్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులకు లక్సెట్టిపేట జూనియర్ కళాశాల, విద్యార్థులకు జైపూర్ జూనియర్ కళాశాలలో శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతీ శిబిరంలో 200 మంది విద్యార్థులకు వివిధ అంశాల్లో నైపుణ్యాలు పెంపొదిస్తామని తెలిపారు. లక్సెట్టిపేట శిబిరంలో ఫోక్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్, పబ్లిక్ స్పీకింగ్, లీడర్ షిప్–జెండర్ సెన్సిటైజేషన్ అంశాలలో, జైపూర్ శిబిరంలో ఎక్స్‌ట్రార్డినరీబూట్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ శిబిరాలు ఈ నెల 22 నుంచి మే 6వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ శిబిరాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట శిబిరం కో ఆర్డినేటర్ ఎం.లలితకుమారి, మంచిర్యాల, మందమర్రి కళాశాలల ప్రిన్సిపాళ్లు మోహన్, ప్రేమారాణి, డీసీవో కార్యాలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఎంపీపీ క్వార్టర్‌లో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సుమన్

ఉట్నూర్‌రూరల్: మండలకేంద్రంలోని ఎంపీపీ జైవంత్‌రావు నివాసముంటున్న క్వార్టర్స్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రూ.20 వేలు నగదు పోయినట్లు ఎంపీపీ తెలిపారు. ఉట్నూర్ ఎస్సై భరత్‌సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సీసీ ఫుటేజీ ద్వారా నిందితుడి ఆచూకీ తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఎంపీపీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, దాసండ్ల ప్రభాకర్ పరిశీలించారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఇంట్లో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీకి గురైనట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. రాజీవ్‌నగర్‌కు చెందిన కదం నాగేందర్ భార్య లావణ్య బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగుడు ఇంట్లో చొరబడి లావణ్య మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు అపహరించినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం నాగేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి బలవన్మరణం



రాథోడ్ అంబాజీ (ఫైల్)

సిరికొండ: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిమ్మన్‌గూడి గ్రామానికి చెందిన రాథోడ్ అంబాజీ (49) గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన ఆయన భార్య లక్కుబాయి గ్రామస్తులకు తెలుపడంతో వెంటనే అతడిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఆరుగురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పల్లిపట్టి తయారీ పరిశీలన



తయారీ పరిశీలిస్తున్న ఆదివాసీలు, సిబ్బంది

కడెం: మండలంలోని కొలాంగూడ గ్రామాన్ని కలెక్టర్ వరుణ్‌రెడ్డి దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఇటీవల గ్రామంలో పర్యటించి ఆదివాసీలకు ఉపాధి కల్పించేందుకు పల్లిపట్టి యూనిట్ ఏర్పాటు నెలకొల్పనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఐకేపీ సిబ్బంది.. గ్రామస్తులను ఉట్నూర్‌లోని పీనట్ చిక్కి ఇండస్ట్రీకి తీసుకెళ్లారు. పల్లిపట్టి తయారీ విధానం, ప్యాకింగ్, అమ్మకాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో కొలాంగూడ మహిళలకు అధికారులు పల్లిపట్టి తయారీపై పూర్తి శిక్షణ ఇప్పించనున్నారు. ఇందులో ఐకేపీ ఏపీఎం రాజారాం, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యేకు జైకొట్టిన అధికారి



ఎమ్మెల్యేకు జై కొడుతున్న అధికారి

ఖానాపూర్: అతనో ప్రభుత్వ అధికారి.. ప్రజా సమస్యలను పట్టించుకోవాల్సిన బాధ్యత కలిగిన వ్యక్తి.. రాజకీయాలతో వారికి సంబంధం ఉండదు. కానీ అతను ఎమ్మెల్యేకు జై కొట్టడం వివాదస్పదమవుతోంది. క్రమబద్ధీకరణలో భాగంగా నాలుగు మండలాల కార్యదర్శులతో కలిసి గురువారం ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన సమయంలో బహిరంగంగానే ఎమ్మెల్యే నాయకత్వం వర్ధిల్లాలి అంటూ చేసిన నినాదాల వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఎంపీవో, మున్సిపల్ కమిషనర్ హోదాలో ఉన్న సదరు అధికారి కేవలం ఎమ్మెల్యే మెప్పు పొందేందుకు ఈ విధంగా ప్రవర్తించాడని పలువురు చర్చించుకుంటున్నారు.

చిన్నారికి దాతల అండ

సాక్షి ఎఫెక్ట్

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో అనారోగ్యానికి గురై మృత్యువుతో పోరాడుతున్న చిన్నారి శ్రీనిధి వైద్యానికి ఆర్థికసాయం అందించేందు దాతలు ముందుకొస్తున్నారు. ఈనెల20న సాక్షిలో మా కూతుర్ని కాపాడండి అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించారు. గురువారం శ్రీనిధి చదువుతున్న ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కలిసి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మరో ఉపాధ్యాయుడు తన వంతుగా రూ.రెండు వేలు అందించారు. వివిధ ప్రాంతాల వారు తమ వంతు సాయం చేస్తుండటంతో గురువారం రూ.30వేల వరకు దాతల ద్వారా అందినట్లు చిన్నారి కుటుంబసభ్యులు తెలిపారు.